కథా నిలయం
3819
శ్రీకాకుళం

# హరిప్రియ

---

హరిప్రియ తను చెప్పబోయే హరికథలోని రసవత్తరమైన సన్నివేశాలు మరోసారి సాధన చేసుకుంటోంది. గొంతులోని మాధుర్యం శృతిచెడకుండా భావయుక్తంగా పలకగలగాలి. అభినయం కూడా జాగ్రత్తగా చూసుకోవాలి.

ఏమిటో ? తను సరిగా చెప్పగలిగితే పేరువస్తుంది.

జీవనోపాధికి ఓ అవకాశం ఏర్పడుతుంది. తను మొదటిసారే సరిగా చెప్పలేకపోతే, ఆపైన ఊహించలేకపోయింది.

తను చేపట్టిన కళ కనీసం తనకు కుటుంబ పోషణకైనా ఉపయోగపడాలి. ఓ గంట తర్వాత గదినుంచి బయటకు వచ్చిన హరిప్రియ, "అమ్మా ! టైముకావస్తోంది ఇక నేవెళ్ళాలి" అంది. "ఒక్కదానివే వెళతావా? వచ్చేటపుడు ఎంతరాత్రి ఔతుందో?" "మరేం చెయ్యనమ్మా? తమ్ముళ్ళిద్దరూ తీరికలేదన్నారు. చెల్లాయిలు కూడా రావటానికి అవదన్నారు. అయినా ఇప్పుడు నాకేం భయం" హరిప్రియ తయారై బయలుదేరింది. అలా ఆడపిల్ల ఒంటరిగా హరికథ చెప్పడంకోసం వెడుతుంటే అన్నపూర్ణమ్మ మనస్సు ఏదోలా అయిపోయింది. ఏమిటో తనకు భగవంతుడు ఇలాటిస్థితి ఎందుకు కల్గించాడో? ఆవిడ కళ్ళల్లో కన్నీటిబొట్లు నిలిచాయి. పోనీ తనేకూతురికి తోడుగా వెళ్ళిఉండవలసిందేమో ! కానీ ఎలా? నిట్టూర్చుతూ లోపలికి వెళ్ళిపోయింది.

తంబూరాశృతి. ఆ శృతిలో నెమ్మదిగా లీనమవుతోంది వయొలెన్. మృదంగం శృతి సర్దుకున్నది. హరిప్రియ గొంతు సవరించుకుంది. వినడంకోసంవచ్చిన ప్రేక్షకులకు, భగవంతునికి ఒక్కసారి నమస్కరించింది. "మీరిక ప్రారంభించవచ్చు" ఓ కంఠంనెమ్మదిగా పలికింది. తనకు దూరమైపోయిన తండ్రికి మనస్సులోనే నమస్కరించుకొని కథాప్రారంభం చేసింది. హరిప్రియ మాధుర్యభరితమైన కంఠస్వరం, పలుకులోని తీయదనం, సంగీత ప్రావీణ్యత రసభరితంగా చెబుతున్నతీరు శ్రోతలను మరపించి అయిదారు గంటల సమయం అరక్షణంలా గడిచిపోయింది. పూర్తయ్యాక అందరూ హరిప్రియని ఎంతగానో అభినందించారు. "ఇంతచక్కని కథాకాలక్షేపం

ఎక్కడా వినలేదు.... వయస్సులో ఏమంత పెద్దది కాకపోయినా ఎంతచక్కగా చెప్పింది. ఏమి గాత్రమాధుర్యం! ఈ అమ్మాయికి మంచి భవిష్యత్తుంది..." ఇలాంటి మాటలు జనంమధ్యనుంచి హరి ప్రియకు కర్ణపేయంగా వినవస్తున్నాయి. ఎంతో సంతోషంగా అన్పించింది ఆమెకు. కాస్సేపటి తర్వాత కథాకాలక్షేపాన్ని ఏర్పాటు చేసిన పెద్దల దగ్గర పారితోషికం అందుకొని ఇంటికి బయలుదేరింది ఆటోలో. ఇల్లు చేరుకునేసరికి అర్థరాత్రి దాటిపోయింది. అన్న పూర్ణమ్మ మాత్రం కూతురికోసం ఎదురుచూస్తూ కూర్చుంది. హరి ప్రియ రాగానే "అమ్మయ్య వచ్చేశావా తల్లీ" అంది ఆప్యాయంగా. "బావుందమ్మా నేనేమైపోతానని కాసేపటికే బెంగపెట్టేసుకున్నావు?" అంటూ నవ్వేసింది. "ఇదిగోనమ్మా! నీదగ్గరవుంచు తొలిసారిగా నాకు లభించిన పారితోషికం. ఇంక కొన్నాళ్లు ఎలాగడుస్తుందా అన్న దిగులు లేదు. ముఖ్యమైన అవసరాలుచూడు. రేపు బజారుకెళ్ళి ఇంటికి కావలసినవి తీసుకొస్తా. త్వరలోనే ఇలాంటి మరో అవకాశం వస్తే అదృష్టవంతులమే!" హరిప్రియ తనచేతుల్లో ఉంచినడబ్బును భగవత్ ప్రసాదంగా భావించి కళ్ళకద్దుకుంది అన్నపూర్ణమ్మ. హరి ప్రియ ముఖం కడుక్కొని బట్టలుమార్చుకొని వచ్చేసరికి అన్నపూర్ణమ్మ భోజనం వడ్డించింది. "నాకు ఆకలిగా లేదమ్మా! ఈ పూటకు ఇంకేంవద్దు" "అదేమిటే కాస్త ఎంగిలిపడు. పోనీ కొద్దిగా పాలైనా లేపు. రేపటినుంచీ బాకి తీర్చేస్తే పాలవాడు పాలుపోస్తాడు"- తల్లి బలవంతానఅన్నం తినిపించింది. హరిప్రియ వెళ్ళిపడుకుంది. బాగా అలసి వుండడంవల్ల వెంటనే నిద్రపట్టేసింది. అన్నపూర్ణమ్మమనసు మాత్రం పాతజ్ఞాపకాలతో బరువెక్కిపోయింది. నిద్రపోతున్న హరి ప్రియను ప్రేమగా ఒక్కసారి చూసింది. నిన్నమొన్నటివరకు హరి ప్రియ పెళ్ళినిగురించి తనూ, ఆయనా ఎన్నిబంగారుకలలు

కన్నారని!ఎంతో ధనవంతుడు, ఓ పెద్ద ఆఫీసరు హరిప్రియకు భర్త కావాలని తను అనుకుంటే, విద్యావంతుడు, వినయసంపన్నుడు హరిప్రియను చేపట్టాలని కన్నతండ్రి ఆశించేవాడు. భర్త తలపులో మెదలగానే అన్నపూర్ణమ్మకు దుఃఖంవచ్చింది. అత్తవారింటికి వచ్చి నప్పటినుంచి తనకు ఎంతగానో ప్రేమానురాగాలందించి కన్నవారిని మరిపించిన భర్తగా నారాయణరావు రూపం ఆమె కళ్ళల్లో కదలాడింది. 'ఆయనే జీవించి వుంటే తనకీరోజు ఇన్నిసమస్యలు కలతలు వుండేవా?'

ఆ దంపతులకెప్పుడూ సంసార జీవితం నిస్సారంగా అనిపించేది కాదు. ఆర్థిక ఇబ్బందులైనా, మరే వడిదుడుకులైనా చిత్తస్థైర్యంతో చిరునవ్వుతో నెట్టుకుపోయేవారు. ఐదుగురు బిడ్డలకుజన్మనిచ్చి, అందరిపట్ల తమ బాధ్యత నెరవేర్చటానికి ప్రయత్నించేవారు. "హరిప్రియకైతే చదువు అంటే అసక్తి లేకపోయినా ఆయన ప్రోత్సాహంతో ఇంటరు పూర్తిచేసింది. అప్పటినుంచి సంబంధంకోసం అన్వేషిస్తూనే ఉన్నారు. కానీ దానికామూడుముడులూ పడే అదృష్టం లేదేమో! ఇలా జరిగింది. పదవీకాలం ముగియకుండానే హటాత్తుగా ఆయన తననూ బిడ్డలనూ దిక్కులేని వాళ్ళనుచేసి వెళ్ళిపోయారు. ఇప్పుడు తనకూ, హరిప్రియకూ ఒకటే దిగులు. ఈ లేమిని ఎలా నెట్టుకురావడం. ఈ పిల్లల బ్రతుకులను ఎలా ఒకగమ్యం చేర్చటం! హరిప్రియ ఈ బాధ్యత తనపైన వేసుకుంది. తండ్రి ముచ్చటపడి చెప్పించిన హరికథలు ఇపుడు తన జీవితానికి, కుటుంబ భవిష్యత్తుకి ఆసరాకాగలవని తోచింది. ఆ మాటే తనతో అంది. చిన్నప్పటినుంచీ శ్రావ్యమైన కంఠస్వరమని హరిప్రియ సరదాపడి హరికథలు నేర్చుకుంటే తను అడ్డుచెప్పలేదు. ఆడపిల్లకనక ఆటా, పాటగా అభ్యాసంచేస్తూ ఉంది అనుకుంది అప్పట్లో! కానీ ఈరోజు పదిమంది

ఎదురుగా హరికథలుచెప్పి, తన కూతురు సంపాదించవలసిన అవసరం కలిగింది...' తీవ్రమైన ఆలోచనలతోనే ఆర్రాత్రి తెల్లవారిపోయింది.

హరిప్రియ సంపాదనతో రోజులుసాఫీగా గడిచిపోతుంటే అన్నపూర్ణమ్మ ఆమెని గురించి మళ్ళీఎప్పుడూ అలా తీవ్రంగా ఆలోచించలేదు. కొడుకులిద్దరూ ప్రయోజకులై హరిప్రియ చేతులమీదగానే ఉద్యోగాలు సంపాదించి సతీమణులతో తమ జీవితాలను స్థిరపరచుకున్నారు. హరికథలు చెప్పటం ప్రారంభించిన కొద్దికాలానికే ఎంతో కీర్తిని ఆర్జించగల్గిన హరిప్రియ అహోరాత్రులూ శ్రమించి లోటు లేకుండా సంపాదించడంవల్ల చెల్లెళ్ళపెళ్ళిళ్లు కూడా వున్నంతలో సజావుగానే చేసెయ్యగల్గింది నిజానికి అన్నపూర్ణమ్మకి ఇప్పుడు ఎలాటి దిగులూ లేదనేచెప్పాలి. మగపిల్లలు ప్రయోజకులు కాగలిగారు తను కన్న స్త్రీసంతానంలో ఇద్దరు హాయిగా సంసారాలు చేసుకుంటున్నారు. ఎటూ మిగిలింది హరిప్రియే. కానీ ఆ విషయం అన్నపూర్ణమ్మకు పదే పదే గుర్తుకురాదు. పెద్దకోడలు ఉద్యోగంచేస్తున్నది కనక పిల్లలసంరక్షణకు అన్నపూర్ణమ్మను వచ్చేయమంటే, ఆడపిల్లను వంటరిగా వదిలేసివెళ్ళితే లోకం ఏమనుకుంటుందో అని కొద్దిగా సంకోచించినా కొడుకుకోడలు మాట తీసెయ్యలేక వెళ్ళిపోయింది. ఆ జీవితమే హాయనిపించింది ఆమెకు. హరిప్రియ ఆమె తలపులలోనుంచి పూర్తిగా దూరమైపోసాగింది. పున్నామనరకం నుంచి రక్షించేవాడు కొడుకు! కొడుకుకోసం ఏమైనచెయ్యాలి అనుకొని ఆత్మవంచన చేసుకోసాగింది.

హరిప్రియకు ఆశ్చర్యమనిపించిది. తనవాళ్ళందరూ తననెలా వదిలేశారు. తనవల్లే ప్రయోజకులైన తమ్ముళ్ళకు, తన మూలంగానే

ఇల్లాళయి జీవిత సౌఖ్యాలన్నీ అనుభవిస్తూ ఇల్లుదిద్దుకుంటున్న చెల్లెళ్ళకూ తండ్రిపోయినప్పటి నుంచీ బాధ్యతంతా తనకే అప్పగించి ప్రశాంతంగా మిగిలినవాళ్ళకు. తనవల్లే వాళ్ళభవిష్యత్తు సుఖమయం చేసిన తన తల్లికీ-వీరందర్కీ తనేమీ కాకుండాపోయిందా? తనకిక మిగిలింది వంటరి జీవితమేనా?

తనవాళ్ళందరి కోసం బ్రతికి తనకంటూ జీవితంలో ఏమీ మిగుల్చుకోలేక పోయింది. పందిరితోడుకోసం పాకులాడుతున్న తీగలా ఆమె మనసు తోడుకోసం వెతుక్కోసాగింది. ఒంటరిజీవితం ఆమెకు వెగటుగా అన్పించింది. వెంటనే ప్రయాణమై కొంత కాలం గడపాలని పెద్దతమ్ముడింటికి వెళ్ళింది. అతినాగరీకంగా జీవితాలను గడుపుతున్న వాళ్ళకు హరిప్రియ ఉనికి భరింపరానిదిగా అనిపించింది. ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన హరిప్రియను ఆ ప్రాంతంవారుకూడా హరికధలు చెప్పమని అడగటంతో ఆ భార్యాభర్తలకు చికాకుకల్గింది. "అక్కా! నువ్వుమాతోఉంటే అభ్యంతరం లేదు కాని, ఈ పిచ్చి పిచ్చి వేషాలన్నీ మానేయి. అమ్మతోపాటు ఇంట్లో ఉండు" అన్నమాట ములుకులా హరిప్రియ మనస్సును గాయపరచింది. అవమానాన్ని భరించలేక చిన్నతమ్ముని దగ్గరకు వచ్చేసింది.

ఆ ఇంటకూడా ఇంచుమించు అదేపరిస్థితి కలవర పెట్టసాగింది. అవకాశం లభించినపుడు తన కళాజీవితానికి దూరంగా వుండలేక పోతూంది. ఓసారి ప్రక్కగ్రామంలో హరిప్రియ ప్రోగ్రాంఇచ్చి వచ్చేసరికి తమ్ముడు మరదలూ మండిపడ్డారు. "అక్కా! నువ్వు మరెప్పుడూ హరికథలు చెప్పొద్దు. అదిమాకు ఎంత అగౌరవమో తెలుసా? నువ్వు ఎక్కడో దూరానఉండి హరికథలుచెప్తున్నావంటేనే మాకు

తలకొట్టేసినట్టు వుంటుంది. ఇక ఇక్కడే ప్రారంభించేవంటే మా పరువుప్రతిష్ఠలు ఏం కావాలి? "నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న తమ్ముడిని చూస్తూంటే హరిప్రియ హృదయం బాధతోనూ కోపం తోనూ రగిలిపోయింది. ఆపుకోలేక "నేనిప్పుడు అంత కానిపని ఏం చేశాను? మత్తుగా తాగి మన సంస్కృతి సభ్యతలను మరచిపోయి బయట క్లబ్బుల్లో నాట్యాలుచేయటం నాగరికత అనిపించుకుం టుందా? మనసంస్కృతికి ప్రతిబింబాలయిన కళలను చేబట్టటంవల్ల పరువు ప్రతిష్టలు భంగపడిపోతాయా" అంది ఆవేశంతో. "అవన్నీ అనవసరం! నీకు ఇష్టమైతే మాఇంట వంటమనిషిగా వుండు! లేదంటే నీ దారిన నువ్వెళ్ళు".

హరిప్రియ సహించలేకపోయింది. మర్నాడు ప్రయాణం కాబోతుండగా తనపేర రెండువుత్తరాలు వచ్చాయి. తను వాళ్ళదగ్గ రకుకూడా ఎక్కడ వచ్చేస్తుందో అని భయపడి కాబోలు పాపం చెల్లెళ్ళు ఇద్దరూ చెరో వుత్తరం వ్రాశారు. రెంటిసారాంశం ఒక్కటే. హరికథలు చెప్పేదాని చెల్లెలివని, భర్తలు ఇప్పటికే చులకనగా చూస్తు న్నారు. "దయచేసి మమ్మల్ని మరచిపో!" హరిప్రియకు నవ్వొ వచ్చింది. వాళ్ళు రమ్మన్నా తనువెళ్ళదు. పాపం ప్రయాసపడి రావ ద్దని రాసేరు. ఏ కళ వాళ్ళంతా చక్కగా జీవించటానికి పూలబాట వేసిందో, ఆ కళను ఎంతగానో ఏవగించుకుంటున్నారు వాళ్ళకోసం సంపాదించటానికి తను ఈ కళను చేపట్టిన రోజుల్లో ఎన్ని ఎదు ర్కొంది. అప్పుడు కుటుంబపోషణ కోసమే అనిపించినా ఇపుడు కళారాధనే తన జీవితం

హరిప్రియ తనవూరు వచ్చేసింది. ఆ రోజేమళ్ళీ అక్కడ తన కథాకాలక్షేపం ఏర్పాటుచేశారు. ఎప్పటిలా శ్రోతలను ఆకట్టుకున్నా

తన మనస్సు మాత్రం మనస్సులోలేదు. జీవితంలో ఏదో వెలితి తోస్తూంది. ఆలోచిస్తున్న హరిప్రియను ఓవ్యక్తి అభినందించడానికి ఆమె దగ్గరకు వచ్చాడు. అరవయ్యేళ్ళు పైబడ్డ అతనిని చూడగానే హరిప్రియకు ఎందుకో పూజ్యభావం కల్గింది. వినమ్రంగా నమస్కరించింది. ఎంతగానో మెచ్చుకొని ఆశీర్వదిస్తుంటే ఏదోపులకింతగా అన్పించింది. నువ్వు ఎక్కడ నేర్చుకున్నావని ప్రశంసన తర్వాత అడిగాడతను. హరిప్రియ జవాబుకు అతని కళ్ళు వింత కాంతులతో వెలిగిపోయాయి. పట్టరాని సంతోషంతో ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. "హరీ! నేనేనమ్మా ఆ అదృష్టవంతుడ్ని" అంటూ, హరిప్రియ ఆనందంతో అతనికి పాదాభివందనంచేసింది. వాత్సల్యంతో తల నిమురుతూ, "చిన్నప్పుడు సరదాకి సాధనచేస్తున్నావనుకున్నాను గానీ, ఇంతగా ఆరాధిస్తావనుకోలేదమ్మా! నాజీవితం ధన్యమైంది" అన్నాడు. మాస్టార్ని మరునాడు భోజనానికి ఆహ్వానించి తన మనస్సును కలవరపెడుతున్న తన కథ అంతా చెప్పింది. ఆయన నిండుగా నవ్వి "పిచ్చిపిల్లా! ఇంతమాత్రానికే అంతబాధపడతావేం! కళాకారులకి ఎప్పుడూ వంటరితనమనేదే ఉండదమ్మా! కళకు మించినతోడు ఈలోకంలోనేలేదు. నువ్వు రంజింపచేస్తున్న శ్రోతలంతా నీవాళ్ళు కాదా! మరింతగా నీ కళను ఆరాధించి హరిప్రియ అనే నీపేరును సార్థకంచేసుకో! మరొక్కమాట. నీ కళను మెచ్చి, నిన్ను అర్థంచేస్కొనే జీవిత భాగస్వామినికూడా నువ్వు పొందితే పొందవచ్చు". తన కళనుగురించి మాస్టారు అలామాట్లాడేసరికి హరిప్రియ హృదయాకాశంలోని కలతల మేఘాలు చెదరిపోయాయి.

పరిపూర్ణమైన మనస్సుతో "అంతా మీ ఆశీర్వాదం మాస్టారూ;" అంది.